## క్లుప్తంగా

### ఘనంగా హసన్ వలి ఉరుసు



పెరవలిలోని హసన్ వలి స్వామి దర్గా

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో హజరత్ హసన్‌వలి 65వ ఉరుసులో భాగంగా ఆదివారం షంషీర్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన స్వామి వారి షంషీర్‌ను గుర్రంపై కొలువుంచి మేళ తాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు, పెద్దలు, పిల్లలు చక్కెర చదివింపులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామి వారికి కానుకలను సమర్పించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### దేవరగట్టులో కార్తీక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టులో కార్తీక మాసంలో భాగంగా ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయంలో సుప్రభాత సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన మొదలైన పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్‌మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే గాకుండా దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు పనులకు పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

మద్దికెర: గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని అన్నారు. ఆదివారం స్థానిక సొసైటీ రోడ్డు నుంచి బొజ్జనాయునిపేట రోడ్డు వరకు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో రూ.80 లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ శేషయ్య, ఏఈ మోహన్‌నాయక్, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, వెంకటేశ్వరరెడ్డి, ఆంజనేయులు, తాలూరు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రామస్వామి అధికారులకు సూచించారు. ఆదివారం కృష్ణగిరి, ఎరుకలచెరువు గ్రామాల్లో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో సమర్థవంతంగా అమలవుతున్నాయన్నారు. ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం, ఉజ్వల పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. వైద్యాధికారి ప్రదీప్, ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ శివప్రసాద్, టీఏ శేషిరెడ్డి, బీజేపీ నాయకులు రంజిత్ కర్ని, రామలింగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మూలధనం పెంచాలి

మద్దికెర: మండల పరిధిలోని బురుజల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులుగా కొనసాగించడానికి మూల ధనాన్ని పెంచాలని సంఘం చైర్‌పర్సన్ సుబ్బయ్య, సీఈఓ మల్లికార్జున అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సహకార సంఘంలో ఉన్న సభ్యుల షేర్ క్యాపిటల్ రూ.300 కంటే తక్కువగా ఉన్న సభ్యులందరూ 15 రోజుల్లోగా నగదు చెల్లించి సభ్యత్వం కొనసాగించుకోవాలన్నారు. సభ్యులు తమ ఫొటోతో పాటు ఆధార్ కార్డు, సంఘం ఐడీ కార్డు, పొలం పాస్‌బుక్ తీసుకొని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# సొంతింటి కల సాకారం

- గ్రామాలను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న ప్రభుత్వం



రామదుర్గం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

చిప్పగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. వందలాది మందికి ఒకే చోట ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో జగనన్న కాలనీలు కొత్త ఊళ్లుగా రూపుదిద్దుకుంటున్నాయి.

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు నిర్మించుకోవడమనేది జీవిత కల. ఇక పేద, మధ్య తరగతి కుటుంబాలకైతే ప్రస్తుత ధరల దృష్ట్యా సొంతిల్లు నిర్మించుకోవడమనేది దాదాపు అసాధ్యం. అలాంటి అసాధ్యమైన కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేసేందుకు పూనుకున్నారు. సొంతిల్లు లేని నిరుపేదలు ఉండరాదనే లక్ష్యంతో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కొక్కరికీ 1.50 సెంటు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక తోడ్పాటు అందిస్తుండడంతో పేదల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గత ప్రభుత్వాల పాలనలో పేదల ఇళ్ల నిర్మాణాల గురించి ఏ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇల్లు కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం ఉండేది కాదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన వారు దరకాస్తు చేసుకున్న 90 రోజుల్లోనే ఇంటి పట్టాలు మంజూరవుతున్నాయి. ఒక్క చిప్పగిరి మండలంలోనే 735 మందికి ఇళ్ల స్థలాలు మంజూరుకాగా ఇప్పటికే 202 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని వాటిలో నివాసం ఉంటున్నారు. మిగతావి వివిధ దశల్లో శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్నాయి. వాటిలో బిలో బేస్‌మెంట్ లెవల్ – 276, బేస్‌మెంట్ లెవల్ – 233, లెంటల్ లెవల్ – 25 స్లాబ్ లెవల్ –3 దశలలో నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.



బంటనహాలులో సుందరంగా రూపుదిద్దుకున్న ఇల్లు

### సొంతిల్లు కట్టుకుంటానని అనుకోలేదు



ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు కట్టుకోవాలనే కోరిక ఉండేది. ప్రభుత్వాలు మారినా మాలాంటి పేదలకు ఉచితంగా ఇంటి పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకునే అవకాశాన్ని ఏ నాయకుడు కల్పించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటి స్థలం ఇచ్చి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక తోడ్పాటు అందించారు. దీనికి మరికొంత కలిపి ఇల్లు నిర్మించుకున్నాం. సీఎం జగనన్నతోనే నా సొంతింటి కల నెరవేరింది. మా కుటుంబం మొత్తం జగనన్నకు రుణపడి ఉంటాం.

– గోవిందు, లబ్ధిదారుడు, బంటనహాలు

### పెండిగ్ లేకుండా బిల్లుల మంజూరు



మండలంలో నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు నిర్మాణ దశను బట్టి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరవుతున్నాయి. మండలంలో 735 మందికి ఇళ్ల పట్టాలు మంజూరుకాగా ఇప్పటికే 202 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం. ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

– సీవీ కొండయ్య, ఎంపీడీఓ

### తాగునీటి సరఫరా పరిశీలన

దేవనకొండ: తాగునీరు కలుషితమై దాదాపు పది మంది వాంతులు, విరేచనాలతో దేవనకొండ ఆస్పత్రిలో చేరగా, కొంతమంది కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. దీనిపై వార్తా కథనాలు ప్రచురితం కావడంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు ఆదివారం దేవనకొండలోని ఎర్రగోటి కాలనీ, పాత మార్కెట్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను పరిశీలించారు. తాగునీరు ఫిల్టర్ చేస్తామని, పైపులైన్ మారుస్తామని చెప్పారు. పంచాయతీ సెక్రటరీకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. ఎస్‌ఈతో పాటు జెడ్పీటీసీ రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

పత్తికొండ రూరల్: స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సేవాదళ్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి అన్నారు. గడప గడపకూ సేవాదళ్ పర్యటనలో భాగంగా ఆదివారం స్థానిక 18, 19వ వార్డుల్లో ఆయన పర్యటించారు. సంస్థలో సభ్యత్వం ఉన్న కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లి చీర, గాజులు, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సేవాదళ్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేలా సభ్యుల ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకునేందుకు అన్ని కాలనీల్లో పర్యటిస్తున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా సేవాదళ్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవచ్చన్నారు. నాయకులు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అనిత, సరోజ, వార్డు సభ్యులు నాగరాజు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## భూ అక్రమాలకు పాల్పడితే చర్యలు



గోనెగండ్లలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, సీఐ

గోనెగండ్ల: ఇటీవల భూ సమస్యలపైనే ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తున్నారని, ఎవరైన భూ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. ఆయన ఆదివారం సీఐ మోహన్ రెడ్డితో కలిసి గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. కున్నూరు గ్రామంలో ఇరువర్గాల వారితో సమావేశం నిర్వహించి సూచనలు చేశామన్నారు. వారి సమస్యలను గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి పరిష్కరించినట్లు పేర్కొన్నారు. అలాగే తిభద్రతల పరిరక్షణలో నేర చరిత్ర గలిగిన వారితో సమావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరికలు చేస్తామన్నారు. పాత నేరస్తులు తీరు మార్చుకుని ఆదర్శ జీవితం గడపాలని సూచించారు. వారానికి రెండు గ్రామాల్లో సీఐ, ఎస్ఐలు పర్యటించి అవసరమైతే పల్లెనిద్ర చేసి అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. భూ సమస్యలుంటే గొడవలు పడకుండా గ్రామంలోని పెద్దలు, రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం గోనెగండ్లలోని హరిజనవాడ పాఠశాల, జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐలు తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ముమ్మరంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు



పూలచింతలో నిర్మాణం పూర్తయిన ఆర్బీకే

నందవరం: మండల పరిధిలోని పూలచింత గ్రామంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ కార్యాలయాల కోసం నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ అధికారులు ముమ్మరం చేశారు. వీటికి బిల్లులు పూర్తిగా చెల్లించడంతో పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం ఒక్కొక్క గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రానికి (ఆర్బీకే) రూ.21.80 లక్షలు నిధులు మంజూరు చేసింది. రైతు భరోసా కేంద్రం పనులు దాదాపుగా పూర్తి చేశారు, విద్యుత్, స్టీల్ వర్క్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. సచివాలయంలో బండపరుపు, ప్లాస్టింగ్‌పనులు జరుగుతున్నాయని ఈ నెల ఆఖరుకల్లా భవన నిర్మాణాలు పూర్తి చేశామని పీఆర్ అధికారులు చెబుతున్నారు.

## అంతర్గత రోడ్లకు మహర్దశ



నాడు - అధ్వానంగా ఉన్న రోడ్డు



నేడు - ఎద్దులదొడ్డి ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

తుగ్గలి: మండలంలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లకు మహర్దశ కలుగుతోంది. ఎద్దులదొడ్డి ఎస్సీ కాలనీలో గతంలో చిన్నపాటి వర్షానికే మట్టి రోడ్డుపై వర్షపు నీరు నిలిచి నడవడానికి వీలుండేది కాదు. వర్షపు నీరు మురుగుతో కలిసి నిల్వ ఏర్పడి దుర్గంధం వెదజల్లేది. దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలేవి. ఇప్పుడు ఆ బాధలన్నీ తప్పాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.20 లక్షలు కేటాయించడంతో కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తయ్యాయి. సీసీ రోడ్డు ఏర్పాటు చేయడం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కనులపండువగా లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవ దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): బొమ్మిరెడ్డిపల్లె అన్నపూర్ణ సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు నాగేశ్వరమ్మ, లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో గణపతి పూజతో మొదలై రుద్రాభిషేకం, నవగ్రహ, అష్టదిక్పాలకులకు ఆరాధన, సకలదేవత స్వాహాకార రుద్రయాగం జరిగాయి. నూతనంగా తయారు చేయించిన నాగభరణం, కిరీట ధారణ, గ్రామోత్సవం అనంతరం అన్నపూర్ణ, భీమలింగేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు సంప్రదాయబద్ధంగా కళ్యాణం జరిపించారు. తదుపరి హారతులు, నైవేద్యాల అనంతరం అతిథులు, భక్తాదులు కార్తీక వనభోజనాలు చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం నిర్వహించారు. పలు ఆలయాల పీఠాధిపతులు అనంతకుమార్, చౌడ్కూరు కుమారస్వామి, రామాంజనేయులు, దాసరి రామచంద్రారెడ్డి, బాలస్వామి, బొమ్మిరెడ్డిపల్లె, చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఓటరు జాబితా పక్కాగా రూపొందించండి



వెల్దుర్తిలో బీఎల్‌ఓలతో సమీక్షిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి డాక్టర్ వేణుగోపాల్

వెల్దుర్తి(కృష్ణగిరి): బీఎల్‌ఓలు ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం చేయొద్దని, సమగ్రంగా నిర్వహించేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని పత్తికొండ నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. ఆయన ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. డబుల్ ఓట్లను తొలగించేలా, ఒక ఓటరు ఒకే ఓటు అన్నట్లుగా, ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా పరిశీలన చేపట్టాలన్నారు. డబుల్ ఓట్లను తొలగించే క్రమంలో ఓటరు అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును వెంటనే విచారించి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. తహసీల్దార్ శివరాముడు, ఎంఈఓ–2 రమేష్ పాల్గొన్నారు.

## సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

ఆలూరు: విద్యార్థులకు సైన్స్ విజ్ఞానంపై ఆసక్తి పెంచి, వారిని అత్యుత్తమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందని అరికెర గురుకుల బాలయోగి బాలుర కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కళాశాలలో ఆదివారం విద్యార్థులు విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక నమూనా ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ఉత్తమ ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తిరుమలరెడ్డి, మోహన్, హెచ్ఎం అశ్వినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు వలంటీర్లకు సమావేశం

నందవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమంపై గ్రామ వలంటీర్లకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టి.సోమలగుడూరు–1, 2, కనకవీడు–1, 2, గురజాల, హాలహర్వి–1, 2, నదికైరవాడి, ఇబ్రహీంపురం, పెద్దకొత్తిలికి గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ఉదయం 10 గంటలకు, నందవరం–1, 2, 3, ముగతి–1, 2, నాగలదిన్నె–1, 2, మాచాపురం, పూలచింత గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందని వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

### 13 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు మహేష్, వెంకటేష్, జగదీష్ పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి 14వ తేదీ వరకు పోటీలు ఉంటాయన్నారు. విజేతకు రూ.16,116, రెండవ బహుమతి రూ.12,116 మూడవ బహుమతి రూ. 6,116 అందజేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే జట్టు సభ్యులు 12వ తేది సాయంత్రం లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 97044 12008, 63016 06283 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### జయప్రదం చేయండి

నందవరం: డిసెంబరు 18, 19వ తేదీల్లో ఎమ్మిగనూరులో జరిగే ఏపీ రైతు సంఘం 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంపన్నగౌడ్, సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కేంద్రంలో ఏపీ రైతు సంఘం మహాసభ కరపత్రాలను వివిధ రైతు సంఘాల నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు, తాగు నీరుతో పాటు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా ఈ మహాసభకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం నాయకులు శాంతన్న, విజయకుమార్, లక్ష్మన్న, లిమ్మప్ప, ముని, తాయన్న, హనుమంతు పాల్గొన్నారు.

### చెళ్లగుర్కికి పాదయాత్ర



పాదయాత్ర చేపట్టిన హెబ్బటం భక్తులు

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామం నుంచి కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన చెళ్లగుర్కిలో వెలసిన ఎర్రితాతను దర్శించుకోవడానికి భక్తులు భారీసంఖ్యలో తరలివెళ్లారు. శనివారం నుంచి మొదలైన వీరి పాదయాత్ర ఆదివారం హొళగుంద సరిహద్దును దాటింది. ఎర్రితాత దేవుడిపై భక్తి భావం, పూజా పునస్కారాలకు ప్రాధాన్యత ఇచ్చే హెబ్బటం గ్రామానికి చెందిన భక్తులు గ్రామ శివారులో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్న నారాయణస్వామి ఆధ్వర్యంలో 50 మంది ఎర్రితాత దర్శనానికి బయలుదేరి ఆదివారం రాత్రికి అక్కడికి చేరుకున్నారు. అక్కడ స్వామివారిని దర్శించుకుని కార్తీక మాసం సందర్భంగా జరుగుతున్న నిత్య పూజల్లో పాల్గొన్నారు.

### ప్రారంభోత్సవానికి సిద్ధం



నిర్మాణం పూర్తయిన విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలు

హొళగుంద: మండల కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ –3, 4 నూతన భవనాలు రూ.41.60 లక్షలతో నిర్మించారు. త్వరలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా భవనాలను ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా తెలిపారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



ఆలూరులో మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసిన బాపురం గ్రామస్తులు

ఆలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచేలా ప్రజలను చైతన్యం చేయాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పార్టీ శ్రేణులకు సూచించారు. ఆయన ఆదివారం ఆలూరులోని నివాసంలో తనను కలిసిన వివిధ గ్రామాల నాయకులకు పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. హాలహర్వి మండలం బాపురం గ్రామంలో రామలయం నిర్మాణానికి సహకారం అందించాలని ఆ గ్రామవాసులు మంత్రిని కోరగా ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు రూ.25 వేలు విరాళం అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ నాగేంద్ర, నాయకులు సూగగౌడు, వీరభద్రి, సదానంద, బసప్ప, రాగవేంద్ర, మారేష్, పార్థన్న, శివరాం, తదితరులు ఉన్నారు.

ఆహ్వానం : దేవనకొండ మండలంలో కొలువుదీరిన శ్రీలక్ష్మి చెన్నకేశవ కొలుట్లయ్య స్వామి ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను కోరారు. ఆదివారం దేవదాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి నివాసానికి వెళ్లి ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, దేవదాయ శాఖ అధికారులు ఉన్నారు.

## హక్కుల కోసం న్యాయస్థానాలను ఆశ్రయించాలి



మాట్లాడుతున్న జడ్జి గురుఅరవింద్

ఎమ్మిగనూరుటౌన్: భారత రాజ్యాంగం పౌరులకు ఎన్నో హక్కులను కల్పించిందిందని, హక్కుల కోసం ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని స్థానిక జడ్జి గురుఅరవింద్ పేర్కొన్నారు. ఆదివారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆర్‌ఎంకే కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. జడ్జి మాట్లాడుతూ.. మానవ హక్కులకు భంగం కలిగినా, ఎవరైనా ఉల్లఘించినా, అన్యాయం జరిగినా మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చని సూచించారు. పలు హక్కులు, చట్టాల గురించి వివరించారు. న్యాయవాద సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షుడు తిమ్మప్ప, కోశాధికారి మురళీకృష్ణ, న్యాయవాదులు దామోదర్ రెడ్డి, ఏసేపు, లింగమూర్తి, రామమూర్తి, ఏఎస్ఐ విజయరాజు, విమల, విద్యావేత్త ఆశా రుక్మాన్, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


### విద్యతోనే సమాజంలో మార్పు



మాట్లాడుతున్న టీటీడీ ధర్మ ప్రచారక్ హిమాలయ స్వామీజీ

పత్తికొండ రూరల్: విద్యతోనే సామాజ మార్పు సాధ్యపడుతుందని టీటీడీ ధర్మ ప్రచారక్ హిమాలయ స్వామీజీ, చిత్రదుర్గ పీఠాధిపతి సచ్చితానంద స్వామీజీ అన్నారు. ఆదివారం పత్తికొండ బైపాస్ రోడ్డులోని రమ్య రిసార్ట్‌లో యాదవుల కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం సంఘం నాయకుడు బళ్లారి మోహన్‌కృష్ణ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళన సమావేశానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి యాదవులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సంకుచితమైన భావన విడనాడి సంఘటితంగా మహోన్నత శక్తిగా ఎదగాలన్నారు. అందరికీ ఆదర్శవంతమైన జీవన విధానం అలవర్చుకున్నప్పుడే వ్యక్తిగత అభివృద్ధితో పాటు భావితరాలకు ఆదర్శం కాగలమన్నారు. సంఘం నాయకులు గుడిసి నరసింహులు, బళ్లారి మోహన్‌కృష్ణ, మల్లికార్జునయాదవ్, ధనుంజయయాదవ్, శ్రీనివాసులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### జగనన్నతోనే పేదలకు మేలు



రామకృష్ణాపురంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న నాయకులు

కృష్ణగిరి: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సచివాలయ కన్వీనర్ సుభాష్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ.. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.24 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. పార్టీ శ్రేణులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు శ్రీరాములు, చిన్నయులు, జయచంద్రుడు, కృష్ణ, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



గురువుకు నమస్కరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామాంజనేయులు

## అ'పూర్వ' కలయిక

ఆలూరు: కలిసిమెలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు 50 ఏళ్ల తరవాత తిరిగి కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, ఉపాధి నిమిత్తం కుటుంబాలతో ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా ఆదివారం ఆలూరు ప్రభుత్వ బాలుర-2 హైస్కూల్‌కు చేరుకుని ఆహ్లాదంగా గడిపారు. అలనాటి మధురమైన తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పాఠశాల ఆవరణలో కలియదిరిగారు. తమకు పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అలనాటి గురువులు ఎస్తేరమ్మ, వీరభద్ర గౌడు మాట్లాడుతూ.. శిష్యులు ఏ స్థాయికి ఎదిగారన్న బెంగ గురువులకు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తమ వద్ద పాఠాలు నెర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగడంపై గర్వపడ్డారు.

**గురువుకు మించిన దైవం లేదు**

గురువు స్థానానికి ఎన్నటికీ విలువ తగ్గదని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. గురువును మించిన దైవం లేదని అభిప్రాయపడ్డారు. సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఆర్అండ్‌బీ రిటైర్డ్ అధికారి ఎస్‌సీ సుబ్బారావ్, సెంట్రల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రిటైర్డు రామ్ మోహన్‌రావు, ఎన్నార్రై మురళీకృష్ణ, నారాయణరెడ్డి, అమీర్‌నాయక్ పాల్గొన్నారు.